# ఆంధ్రప్రదేశ్ పారా వెటర్నరి మరియు అనుబంధ కౌన్సిలు చట్టము, 2023

## అధ్యాయము – I
## ప్రారంభిక

**పరిచ్ఛేదములు**


1. సంగ్రహనామము, విస్తరణ మరియు ప్రారంభము
2. నిర్వచనములు

## అధ్యాయము – II
## ఆంధ్రప్రదేశ్ పారా వెటర్నరి మరియు అనుబంధ కౌన్సిలు

3. ఆంధ్రప్రదేశ్ పారా వెటర్నరి మరియు అనుబంధ కౌన్సిలు ఏర్పాటు
4. కౌన్సిలు స్వరూపము
5. సభ్యుల నిరర్హతలు
6. సభ్యుల పదవీకాలం
7. ఆకస్మిక ఖాళీలు
8. సభ్యత్వ విరమణ
9. సభ్యత్వమునకు రాజీనామా చేయుట
10. ప్రొసీడింగుల శాసన మాన్యత
11. కౌన్సిలు సమావేశములు

## అధ్యాయము – III
## కార్యనిర్వాహక కమిటీ ఏర్పాటు

12. కార్యనిర్వాహక కమిటీ ఏర్పాటు
13. ఫీజు మరియు భత్యముల చెల్లింపులు
14. కౌన్సిలు కార్యదర్శి, ఇతర అధికారులు మరియు ఉద్యోగులు
15. రిజిష్టర్ల నిర్వహణ
16. కౌన్సిలు విఘటనము

## అధ్యాయము – IV
## కౌన్సిలు అధికారములు మరియు కృత్యములు

17. కౌన్సిలు అధికారములు మరియు కృత్యములు
18. ఉప–నిబంధనావళిని చేయుటకు అధికారము
19. ప్రమాణము మొదలగు వాటిపై సాక్ష్యమును తీసుకొనుటకు అధికారము

## అధ్యాయము – V
## పారా వెటర్నరి మరియు అనుబంధ టెక్నీషియన్ రిజిస్ట్రేషను

20. రిజిస్ట్రేషనుకు అర్హత
21. రిజిస్ట్రేషను
22. రిజిస్ట్రేషను నవీకరణ

23. రిజిష్టరు నుండి తొలగించుట

24. రిజిష్టరులో తిరిగి నమోదు చేయుట

## అధ్యాయము - VI

## పారా వెటర్నరి మరియు అనుబంధ విద్య మరియు శిక్షణ సంస్థల గుర్తింపు

25. సంస్థల గుర్తింపు

26. గుర్తింపు ఉపసంహరణ

27. అర్హత గుర్తింపు

28. సంస్థల తనిఖీ

## అధ్యాయము - VII

## ఆర్థిక విషయములు

29. కౌన్సిలు యొక్క నిధి

30. వార్షిక లెక్కలు మరియు ఆడిట్లు

## అధ్యాయము - VIII

## అపరాధములు మరియు పెనాల్టీ

31. ఈ చట్టము క్రింద రిజిష్టరు చేయబడని వ్యక్తులు ప్రాక్టీసు చేయకుండుట

32. ఆసుపత్రులు, సంస్థల అపరాధములు

33. అనధికారికముగా డిప్లొమా మొదలగు వాటిని ప్రదానము చేయుటపై నిషేధము

34. బిరుదులను అనధికారికముగా ఉపయోగించినందుకు పెనాల్టీ

35. అపరాధముల విచారణ

36. సివిలు న్యాయస్థానముల అధికారితా పరిధికి అడ్డంకి

37. అపరాధముల రాజీ

## అధ్యాయము - IX

## వివిధ విషయములు

38. కౌన్సిల్ సభ్యులు, అధికారులు మొదలైనవారు పబ్లిక్ సేవకులుగా ఉండుట

39. సద్భావముతో తీసుకొనిన చర్యలకు రక్షణ

40. ప్రభుత్వముచే ఆదేశములు

41. చిక్కులను తొలగించుటకు అధికారము

42. వినియమములను చేయుటకు అధికారము

43. నియమములు చేయుటకు అధికారము

# ఆంధ్రప్రదేశ్ పారా వెటర్నరి మరియు అనుబంధ కౌన్సిలు చట్టము, 2023

## (2023లోని 24వ చట్టము)

**ఆంధ్రప్రదేశ్ రాష్ట్రములో పశుసంవర్ధక/పాడి పరిశ్రమ/మత్స్య పరిశ్రమ డిప్లొమా హోల్డర్లు మరియు అట్టి డిప్లొమా హోల్డర్లకు శిక్షణ గరపు సంస్థల రిజిస్ట్రేషను కొరకు ఆంధ్రప్రదేశ్ పారా వెటర్నరి మరియు అనుబంధ కౌన్సిలుని ఏర్పాటు చేయుట కొరకు మరియు అందుకు సంబంధించిన మరియు దానికి ఆనుషంగికమైన విషయముల కొరకు నిబంధించుటకైన చట్టము.**

భారత ప్రజారాజ్యపు డెబ్బై నాలుగవ సంవత్సరములో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనమండలిచే ఈ క్రింది విధముగా శాసనము చేయబడినది:-

## అధ్యాయము - I

## ప్రారంభిక

**1. సంగ్రహనామము, విస్తరణ మరియు ప్రారంభము :-** (1) ఈ చట్టమును ఆంధ్రప్రదేశ్ పారా వెటర్నరి మరియు అనుబంధ కౌన్సిలు చట్టము, 2023 అని పేర్కొనవచ్చును.

(2) ఇది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమంతటికి విస్తరించును.

(3) ఇది రాష్ట్ర ప్రభుత్వము అధిసూచన ద్వారా నియతము చేయునట్టి తేదీన అమలులోనికి రావలెను.

**2. నిర్వచనములు :-** ఈ చట్టములో సందర్భము ఇతర విధముగా కోరిననే తప్ప,-

(ఎ) "కౌన్సిలు" అనగా 3వ పరిచ్ఛేదము క్రింద ఏర్పాటు చేయబడిన ఆంధ్రప్రదేశ్ పారా వెటర్నరి మరియు అనుబంధ కౌన్సిలు అని అర్థము;

(బి) "డిప్లొమా హోల్డరు" అనగా గుర్తింపు పొందిన సంస్థ నుండి పశుసంవర్ధక/పాడి పరిశ్రమ/మత్స్య పరిశ్రమలలో డిప్లొమా పొందిన లేదా సమానమైన అర్హతను కలిగియున్న ఎవరేని వ్యక్తి అని అర్థము;

(సి) "సమానమైన అర్హత" అనగా రాష్ట్రములో తత్సమయమున అమలునందున్న ఏదేని శాసనము ద్వారా సమానమైనదిగా గుర్తించబడినట్టి అర్హత లేదా సమానమైన అర్హతగా ప్రభుత్వముచే ఆ విధముగా ప్రఖ్యానించబడి మరియు అధిసూచించబడిన ఏదేని అర్హత అని అర్థము;

(డి) "కార్యనిర్వాహక కమిటీ" అనగా 12వ పరిచ్ఛేదము క్రింద ఏర్పాటు చేయబడిన కౌన్సిలు యొక్క కార్యనిర్వాహక కమిటీ అని అర్థము;

(ఇ) "ప్రభుత్వము" అనగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వము అని అర్థము;

(ఎఫ్) "అధిసూచన" అనగా ఆంధ్రప్రదేశ్ గెజెటులో ప్రచురించబడిన అధిసూచన అని అర్థము మరియు "అధిసూచించబడిన" అను పదమును తదనుసారముగా అన్వయించుకొనవలెను;

(జి) "పారా వెటర్నరి మరియు అనుబంధ కోర్సు" అనగా ఆయా సమయాలలో ప్రభుత్వముచే అధిసూచించబడినట్లుగా ఏదేని డిప్లొమా లేక ధ్రువపత్రమును ప్రదానము చేయుట కొరకు కోర్సులు అని అర్థము;

(హెచ్) "పారా వెటర్నరి మరియు అనుబంధ టెక్నీషియన్" అనగా ఆయా సమయాలలో పారా వెటర్నరి మరియు అనుబంధ టెక్నీషియన్‌గా ప్రభుత్వముచే నిర్దిష్టపరచబడునట్టి లేదా అధిసూచించబడునట్టి వ్యక్తులు అని అర్థము;

(ఐ) "విహితపరచబడిన" అనగా ఈ చట్టము క్రింద చేయబడిన నియమముల ద్వారా విహితపరచబడిన అని అర్థము;

(జె) "అధ్యక్షుడు" అనగా కౌన్సిలు యొక్క అధ్యక్షుడు అని అర్థము;

(కె) "గుర్తింపుపొందిన సంస్థ" అనగా ఈ చట్టములోని 25వ పరిచ్ఛేదము క్రింద గుర్తింపు పొంది, ఆయా సమయాలలో ప్రభుత్వముచే అధిసూచించబడినట్లుగా ఏదేని ఒకటి లేదా ఒకటి కంటే ఎక్కువ పారా వెటర్నరి మరియు అనుబంధ కోర్సులకు శిక్షణ ఇచ్చు ఒక సంస్థ అని అర్థము;

(ఎల్) "గుర్తింపు పొందిన అర్హతలు" అనగా పారా వెటర్నరి మరియు అనుబంధ కోర్సులకు సంబంధించి రాష్ట్రములోని ఏదేని విశ్వవిద్యాలయముచే ప్రదానము చేయబడిన డిప్లొమాలు లేదా దానికి సమానమైన అర్హత అని అర్థము;

(ఎమ్) "రిజిస్టరు" అనగా 15వ పరిచ్ఛేదము క్రింద నిర్వహించబడిన రిజిస్టరు అని అర్థము;

(ఎన్) "వినియమములు" అనగా ఈ చట్టము క్రింద ప్రభుత్వ ఆమోదముతో కౌన్సిలుచే చేయబడిన వినియమములు అని అర్థము;

(ఓ) "కార్యదర్శి" అనగా 14వ పరిచ్ఛేదము క్రింద నియమించబడిన కౌన్సిలు యొక్క కార్యదర్శి అని అర్థము;

(పి) "రాష్ట్రము" అనగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రము అని అర్థము;

(క్యు) "వెటర్నరి ఆసుపత్రి" అనగా అనారోగ్యానికి గురైన పశువుల చికిత్స కొరకు సదుపాయాలు కలిగిన మరియు వాటి ఆదరణ లేదా బస కొరకు ఉపయోగించబడిన ఏదేని ప్రాంగణము;

(ఆర్) "వెటర్నరి ప్రయోగశాల" అనగా ఏదేని వ్యాధి నిర్ధారణకు సంబంధించి మైక్రోబయోలాజికల్, పాథలాజికల్ లేదా బయోకెమికల్ పరిశోధనలు, పరీక్షలు, విశ్లేషణలు, లేదా కల్చర్లు, వ్యాక్సిన్లు, సెరా లేదా ఇతర జీవ సంబంధ ఉత్పత్తుల తయారీని సాధారణముగా నిర్వహించునట్టి సంస్థ అని అర్థము.

## అధ్యాయము – II

## ఆంధ్రప్రదేశ్ పారా వెటర్నరి మరియు అనుబంధ కౌన్సిలు

**3. ఆంధ్రప్రదేశ్ పారా వెటర్నరి మరియు అనుబంధ కౌన్సిలు ఏర్పాటు :–** (1) ప్రభుత్వము, ఈ చట్టము క్రింద తనకు ప్రదత్తము చేయబడిన అధికారములను వినియోగించుటకు మరియు తనకు ఒసగబడిన కృత్యములను నిర్వర్తించుటకుగాను ఆంధ్రప్రదేశ్ పారా వెటర్నరి మరియు అనుబంధ కౌన్సిలు అను సంస్థని అధిసూచన ద్వారా ఏర్పాటు చేయవచ్చును.

(2) కౌన్సిలు ఆస్తిని ఆర్జించుటకు, కలిగియుండుటకు మరియు అమ్మివేయుటకు మరియు కాంట్రాక్టులు కుదుర్చుకొనుటకు ఈ చట్టము మరియు దాని క్రింద చేయబడిన నియమములలోని నిబంధనలకు లోబడి అధికారముతో శాశ్వత ఉత్తరాధికారమును మరియు ఒక సామాన్య మొహరును కలిగియుండిన ఒక నిగమిత సంస్థ అయివుండవలెను మరియు సదరు పేరుతో అది దావాలు వేయవచ్చును మరియు దానిపై దావాలు వేయబడవచ్చును.

(3) కౌన్సిలు యొక్క ప్రధాన కార్యస్థానము అమరావతిలో ఉండవలెను.

**4. కౌన్సిలు స్వరూపము :-** కౌన్సిలు ఈ క్రింది సభ్యులను కలిగియుండవలెను, వారెవరనగా:-

I. పదవిరీత్యా సభ్యులు :

(i) పశుసంవర్థక, పాడి పరిశ్రమాభివృద్ధి మరియు మత్స్య పరిశ్రమ శాఖలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి/ ముఖ్య కార్యదర్శి/ కార్యదర్శి, కౌన్సిలు యొక్క పదవీరీత్యా అధ్యక్షుడిగా ఉండవలెను;

(ii) తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర వెటర్నరి విశ్వవిద్యాలయ వైస్-ఛాన్సలరు, కౌన్సిలు ఉపాధ్యక్షుడిగా ఉండవలెను;

(iii) ఆర్థిక శాఖలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి లేదా ముఖ్య కార్యదర్శిచే నామనిర్దేశము చేయబడిన ప్రభుత్వ ఉప కార్యదర్శి హోదాకు తక్కువకాని ఒక అధికారి సభ్యుడిగా ఉండవలెను;

(iv) ఆంధ్రప్రదేశ్ పశుసంవర్థక శాఖ డైరెక్టరు కౌన్సిలు సభ్య కన్వీనరుగా ఉండవలెను;

(v) ఆంధ్రప్రదేశ్ పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య మేనేజింగ్ డైరెక్టరు - సభ్యుడు;

(vi) ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మత్స్య పరిశ్రమశాఖ కమీషనరు - సభ్యుడు;

(vii) కౌన్సిలు కార్యదర్శి - సభ్యుడు.

II. నామనిర్దేశిత సభ్యులు :

ప్రభుత్వముచే ఐదుగురు (5) సభ్యులు ఈ క్రింది విధముగా నామనిర్దేశం చేయబడుదురు,-

(i) పశు సంవర్థక పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్స్ నుండి ఒక సభ్యుడు;

(ii) మత్స్య పరిశ్రమ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్స్ నుండి ఒక సభ్యుడు;

(iii) ప్రైవేటు పారా వెటర్నరి మరియు అనుబంధ సంస్థల యాజమాన్య సంఘము నుండి ఒక సభ్యుడు;

(iv) పశు సంవర్థక/మత్స్య పరిశ్రమ శాఖలలో 10 సంవత్సరముల కంటే ఎక్కువ సర్వీసు కలిగియున్న పారా వెటర్నియర్లు/మత్స్య పరిశ్రమ శాఖలో సమానార్హత కలిగిన వారి నుండి ఇద్దరు సభ్యులు.

**5. సభ్యుల నిరర్హతలు :-** ఒక వ్యక్తి ఈ క్రింది సందర్భములలో కౌన్సిలు సభ్యునిగా నామనిర్దేశము చేయబడుటకు మరియు సభ్యునిగా ఉండుటకు అర్హునిగా చేయరాదు,-

(i) అతడు అనన్ముక్త దివాలాదారుగా; లేదా

(ii) మతిస్థిమితము లేనివాడై ఉండి మరియు ఆ విధముగా సమర్థ న్యాయస్థానముచే రూఢి ప్రకటన చేయబడినయెడల; లేదా

(iii) అతడు వృత్తిలో అప్రతిష్ఠాకరమైన నడవడికకుగాను ఏదేని రీతిలో కౌన్సిలుచే శిక్షింపబడినయెడల; లేదా

(iv) అతడు ఏదేని ప్రభుత్వ లేదా ఏదేని సంస్థ క్రింద సర్వీసు నుండి బర్తరఫ్ చేయబడిన యెడల; లేదా

(v) ఈ చట్టము క్రింద నిర్వహించబడిన రిజిస్టరు నుండి అతని పేరును తీసివేసిన యెడల మరియు తిరిగి అదే పదవిలోకి తీసుకొనబడనియెడల; లేదా

(vi) అతడు నీతిబాహ్యతతో కూడిన ఏదేని అపరాధమునకు దోషస్థాపితుడైనయెడల.

**6. సభ్యుల పదవీకాలం :–** (1) పదవీరీత్యా సభ్యుడు కాకుండా కౌన్సిలు సభ్యుని పదవీకాలము, అతను పదవిని చేపట్టిన తేదీ నుండి మూడు సంవత్సరముల పాటు ఉండవలెను.

(2) పదవి నుండి విరమించే సభ్యుడు ఇతర విధముగా ఆయన అర్హత కలిగియున్నట్లైతే, తిరిగి నామనిర్దేశమునకు యోగ్యత కలిగివుండవలెను.

**7. ఆకస్మిక ఖాళీలు :–** (1) కౌన్సిలు నామనిర్దేశిత సభ్యుని పదవీ కాలము ముగియుటకు ముందుగా అతని మరణము, రాజీనామా, తొలగింపు లేదా అశక్తత లేదా ఇతరత్రా కారణముచేత అతని పదవిలో ఏర్పడిన ఏదేని ఆకస్మిక ఖాళీ విహితపరచబడునట్టి రీతిలో ఆరు మాసములకు మించని కాలావధిలోగా భర్తీ చేయబడవలెను.

(2) ఉప–పరిచ్ఛేదము (1) క్రింద నామనిర్దేశము చేయబడిన ఎవరేని వ్యక్తి, అతను ఏ సభ్యుని ఖాళీలో నామనిర్దేశము చేయబడినాడో అట్టి సభ్యుని మిగిలిన కాలావధి పాటు పదవినందుండవలెను.

**8. సభ్యత్వ విరమణ :–** కౌన్సిలు పదవీరీత్యా సభ్యుడు కానట్టి సభ్యుడు ఈ క్రింది సందర్భములలో పదవి నుండి తప్పుకొనినట్లుగా భావించబడవలెను,–

(i) అతను రాజీనామా చేసిన మీదట;

(ii) కౌన్సిలుకు తగిన కారణమును తెలియజేయకుండా అతను వరుసగా మూడు కౌన్సిలు సమావేశములకు హాజరు కాని మీదట;

(iii) 5వ పరిచ్ఛేదము క్రింద ఏదేని నిరర్హతకు అతను గురియైన మీదట;

(iv) అతనిని నామనిర్దేశము చేసిన అసోసియేషను లేదా కేటగిరీ నుండి అతను సభ్యునిగా విరమించిన మీదట.

**9. సభ్యత్వమునకు రాజీనామా చేయుట :–** పదవీరీత్యా సభ్యుడుకానట్టి సభ్యుడు లిఖిత పూర్వకముగా అధ్యక్షునికి నోటీసును ఇచ్చుట ద్వారా ఏ సమయములోనైనా తన పదవికి రాజీనామా చేయవచ్చును మరియు అట్టి రాజీనామాను అధ్యక్షుడు ఆమోదించిన తేదీ నుండి అది అమలులోకి రావలెను.

**10. ప్రొసీడింగుల శాసన మాన్యత :–** కౌన్సిలుచే చేయబడిన ఏదేని చర్య లేదా ప్రొసీడింగులు ఈ క్రింది కారణముచేత మాత్రముననే శాసనమాన్యతను కోల్పోరాదు,–

(ఎ) కౌన్సిలు ఏర్పాటులో ఏదేని ఖాళీ లేదా లోపం; లేదా

(బి) కేసు యోగ్యతలకు భంగము కలిగించని అట్టి చర్య లేదా ప్రొసీడింగులో ఏదేని లోపం లేక క్రమరాహిత్యం.

**11. కౌన్సిలు సమావేశములు :–** కౌన్సిలు సమావేశములు, కార్యకలాపముల నిర్వహణ కొరకు ప్రొసీడింగులు మరియు అట్టి ఇతర విషయములు, ఈ సందర్భములో కౌన్సిలుచే చేయబడిన వినియమముల ద్వారా నిబంధించబడవలెను.

## అధ్యాయము - III

## కార్యనిర్వాహక కమిటీ ఏర్పాటు

**12. కార్యనిర్వాహక కమిటీ ఏర్పాటు :-** (1) కౌన్సిలు,వినియమములచే నిబంధించబడునట్టి రీతిలో అట్టి కృత్యములను నిర్వర్తించుటకై అవసరమగునట్టి తన సభ్యుల నుండి ఒక కార్యనిర్వాహక కమిటీని మరియు అట్టి ఇతర కమిటీలను ఏర్పాటు చేయవచ్చును.

(2) కార్యనిర్వాహక కమిటీలో అధ్యక్షుడు మరియు ఉపాధ్యక్షుడు ఉండవలెను వారు కౌన్సిలుచే ఎంపిక చేయబడిన సభ్యులై ఉండి వారిలో ఒకరు ప్రైవేటు పారా వెటర్నరి మరియు అనుబంధ సంస్థల యాజమాన్య సంఘ ప్రతినిధి అయి ఉండవలెను.

(3) కార్యనిర్వాహక కమిటీ ఈ సందర్భముగా చేయబడునట్టి ఏవేని వినియమముల ద్వారా దానికి ప్రదత్తం చేయునట్టి లేదా విధించునట్టి కౌన్సిలు అధికారములు మరియు కర్తవ్యములను వినియోగించవచ్చును మరియు నిర్వర్తించవచ్చును.

**13. ఫీజు మరియు భత్యముల చెల్లింపులు :-** కౌన్సిలు అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు మరియు ఇతర సభ్యులు, కౌన్సిలు లేదా దానికి చెందిన ఏదేని కమిటీ సమావేశములకు సంబంధించి వారి హాజరుకు విహితపరచబడునట్టి సమావేశ ఫీజు మరియు భత్యములు లేదా ప్రయాణ భత్యము చెల్లించబడవలెను.

**14. కౌన్సిలు కార్యదర్శి, ఇతర అధికారులు మరియు ఉద్యోగులు :-** (1) ప్రభుత్వము ఆంధ్రప్రదేశ్ గెజెటులో అధిసూచన ద్వారా ఒక కార్యదర్శిని నియమించవచ్చును. అతను ఈ చట్టము క్రింద నియమించబడిన కౌన్సిలుకి మరియు కమిటీలకు కార్యదర్శిగా వ్యవహరించవలెను.

(2) కౌన్సిలు సాధారణ అధీక్షణ మరియు నియంత్రణకు లోబడి కార్యదర్శి, కౌన్సిలు రోజువారీ వ్యవహారములను మరియు ఆయా సమయములలో కౌన్సిలుచే అతనికి ఒసగబడునట్టి ఇతర కృత్యములను నిర్వర్తించుటకు బాధ్యత వహించవలెను.

(3) కార్యదర్శి, ఆయా సమయములలో ప్రభుత్వముచే నిర్ణయించబడునట్టి జీతము మరియు భత్యములను కౌన్సిలు నిధుల నుండి పొందవలెను.

(4) కార్యదర్శి నియామకపు విధానము మరియు సేవా షరతులు, నిబంధనలు విహితపరచబడునట్లుగా ఉండవలెను.

అయితే ప్రభుత్వము, పశుసంవర్థక శాఖ సంయుక్త డైరెక్టరు/ప్రభుత్వ ఉప కార్యదర్శి హోదాకు తక్కువకాని పదవిలో ఉన్న లేదా పదవీ విరమణ చేసిన అధికారిని కౌన్సిలు కార్యదర్శిగా నియమించవచ్చును.

(5) కౌన్సిలు ఈ చట్టము యొక్క లక్ష్యాలను కొనసాగించుటకుగాను తాను అవసరమని భావించినప్పుడు ప్రభుత్వ పూర్వ ఆమోదముతో అట్టి అధికారులు మరియు ఉద్యోగులను నియమించుకొనవచ్చును.

(6) కౌన్సిలుచే నియమించబడిన అధికారుల మరియు ఇతర ఉద్యోగుల నియామక విధానము, జీతము మరియు భత్యములు, క్రమశిక్షణ మరియు ఇతర సేవా షరతులు మరియు నిబంధనలు వినియమములలో పొందుపరచబడవలెను.

**15. రిజిష్టర్ల నిర్వహణ :-** (1) ప్రభుత్వముచే ప్రఖ్యానించబడిన విధముగా పశుసంవర్ధక, పాడి పరిశ్రమ మరియు మత్స్య పరిశ్రమలలోని డిప్లొమా హోల్డర్లు మరియు అట్టి ఇతర పారా వెటర్నరి/ అనుబంధ టెక్నీషియన్ల కొరకు ప్రత్యేక రిజిస్టర్లను నిర్వహించవలెను.

(2) విహితపరచబడునట్టి రీతిలో (మాన్యువల్ మరియు ఎలక్ట్రానిక్) రిజిస్టరు నిర్వహించబడి అట్టి వివరములను కలిగియుండవలెను.

(3) కార్యదర్శి, ఈ చట్టము మరియు దాని క్రింద రూపొందించబడిన నియమములు మరియు వినియమముల ననుసరించి రిజిస్టర్లను భద్రపరచవలెను.

(4) రిజిస్టర్లు, భారత సాక్ష్య చట్టము, 1872లోని 74వ పరిచ్ఛేదపు అర్థములోపల పబ్లిక్ డాక్యుమెంటుగా భావించబడవలెను. (1872లోని 1వ కేంద్ర చట్టము)

**16. కౌన్సిలు విఘటనము :-** (1) కౌన్సిలు, ఈ చట్టము ద్వారా లేక ఈ చట్టము క్రింద ప్రదత్తము చేయబడిన ఏవేని అధికారములను వినియోగించుటకు విఫలమైనదనీ లేదా అధిగమించినదనీ లేదా దురుపయోగం చేసినదనీ లేదా ఈ చట్టము ద్వారా లేదా ఈ చట్టము క్రింద విధించిన ఏవేని కర్తవ్యములను నిర్వర్తించుటకు విఫలమైనట్లుగా ప్రభుత్వము ఎప్పుడైనా అభిప్రాయపడినచో అట్టి అధికార వినియోగ వైఫల్యము, అధిగమనము లేదా దురుపయోగము తీవ్రమైన ప్రవర్తనగా పరిగణించబడినయెడల దానికి చెందిన వివరములను ప్రభుత్వము, కౌన్సిలుకి అధిసూచించవచ్చును మరియు కౌన్సిలు ఇందు గురించి ప్రభుత్వము నిర్ణయించునట్టి కాలపరిమితిలోగా అట్టి లోపాలను, అధికారములను అధిగమించుట లేదా దురుపయోగం చేయుటను నివారించుటకు విఫలమైనయెడల ప్రభుత్వము కౌన్సిలుని విఘటన మొనర్చవచ్చును మరియు వారు ఉచితమని భావించునట్టి వ్యక్తులచే మరియు అట్టి కాలావధికి వినియోగించు మరియు నిర్వర్తించు అన్ని లేదా ఏవేని కౌన్సిలు అధికారములను మరియు కర్తవ్యములను కలుగజేయవచ్చును మరియు అటుపిమ్మట కౌన్సిలు నిధులు మరియు ఆస్తి, 3వ పరిచ్ఛేదము క్రింద వీలు కల్పించబడినట్లుగా ఒక కొత్త కౌన్సిలుని ఏర్పాటు చేయువరకు ఈ చట్టపు ప్రయోజనముల నిమిత్తం ప్రభుత్వములో నిహితమైయుండవలెను.

(2) ఉప-పరిచ్ఛేదము (1) క్రింద ప్రభుత్వము కౌన్సిలుని విఘటన మొనర్చినపుడు, అట్టి విఘటన తేదీ నుండి ఆరు మాసములలోగా 3వ పరిచ్ఛేదము క్రింద కొత్త కౌన్సిలుని ఏర్పాటు చేయుటకు వారు చర్యలను తీసుకొనవలెను మరియు అట్టి కౌన్సిలుని ఏర్పాటు చేసిన మీదట ఉప-పరిచ్ఛేదము (1)లో పేర్కొన్న ఆస్తి మరియు నిధులు సదరు కౌన్సిలులో నిహితము చేయబడవలెను.

## అధ్యాయము - IV

## కౌన్సిలు అధికారములు మరియు కృత్యములు

**17. కౌన్సిలు అధికారములు మరియు కృత్యములు :-** చట్టములోని నిబంధనలు మరియు విహితపరచబడునట్టి షరతులకు లోబడి కౌన్సిలు, ఈ క్రింది అధికారములను వినియోగించవలెను మరియు కృత్యములను నిర్వర్తించవలెను, అవేవనగా:-

(ఎ) పారా వెటర్నరి మరియు అనుబంధ సంస్థలను ఏర్పాటు చేయుటకు ప్రమాణాలను నిర్ణయించుట;

(బి) పారా వెటర్నరి మరియు అనుబంధ సంస్థలను గుర్తించుట;

(సి) ఈ చట్టము ప్రారంభమునకు ముందు ఏర్పాటు చేసిన ఏదేని సంస్థకు తాత్కాలిక గుర్తింపును మంజూరుచేయుట;

(డి) పారా వెటర్నరి మరియు అనుబంధ సంస్థలకు మంజూరు చేసిన గుర్తింపును ఉపసంహరించుట;

(ఇ) ఈ చట్టము క్రింద రిజిస్టరును నిర్వహించుట;

(ఎఫ్) 23వ పరిచ్ఛేదము క్రింద వ్యక్తుల పేర్లను తొలగించుట;

(జి) 24వ పరిచ్ఛేదము క్రింద రిజిస్టరు నుండి తొలగించిన పేర్లను పునరుద్ధరించుట;

(హెచ్) ఈ చట్టపు ప్రయోజనము నిమిత్తము అర్హతను గుర్తించుట;

(ఐ) వినియమములను రూపొందించుట;

(జె) తన అధికారములను కార్యనిర్వహణ కమిటీకి ప్రత్యాయోజనము చేయుట;

(కె) పారా వెటర్నరి మరియు అనుబంధ సంస్థలను తనిఖీ చేయుట;

(ఎల్) ఈ చట్టము క్రింద విధించు ఫీజులను నిర్ణయించుట;

అయితే, సంస్థల గుర్తింపు మరియు వ్యక్తుల రిజిస్ట్రేషను కొరకు విధించదగు ఫీజు కౌన్సిలు ఖర్చులను భరించునట్టి మొత్తముగా ఉండవలెను మరియు అది కౌన్సిలుకి ఒక అనుచితమైన లాభదాయక వనరు కారాదు.

(ఎమ్) కౌన్సిలు నిధిని నిర్వహించుట;

(ఎన్) రాష్ట్రవ్యాప్తముగా అన్ని పారా వెటర్నరి మరియు అనుబంధ కోర్సులకు ఒకే విధమైన పాఠ్యాంశాలను, కోర్సు కంటెంటును, పాఠ్య ప్రణాళికలను మరియు థియరీ, ప్రాక్టికల్ రెండింటికీ మరియు అంతర్గత పరీక్షలకు పరీక్షల పద్ధతిని రూపొందించుట, రికార్డులను నిర్వహించుట వాటిని తనిఖీ చేయుట మొదలగునవి.

(ఓ) అన్ని డిప్లొమా కోర్సుల కొరకు బోధనా సిబ్బందికి విద్యార్హతలను నిర్ణయించుట;

(పి) ఇతర శాసనాత్మక ప్రాధికార సంస్థలచే నిర్వహించబడినవి తప్ప రాష్ట్రములోని అన్ని పారా వెటర్నరి మరియు అనుబంధ కోర్సులకు థియరీ మరియు ప్రాక్టికల్ రెండింటికీ ఉమ్మడి పరీక్షలను నిర్వహించుట;

(క్యు) ఒక ఉమ్మడి మొహరు క్రింద డిప్లొమాలు, ధ్రువపత్రములు మరియు ఇతర విద్యావిషయక గౌరవములను ప్రదానం చేయుట;

(ఆర్) థియరీ మరియు ప్రాక్టికల్ పరీక్షలకు ఫీజులను నిర్ణయించి వసూలు చేయుట;

(ఎస్) పారా వెటర్నరి మరియు అనుబంధ కోర్సులు, పాఠ్యాంశములు, ప్రవేశముల కొరకు విద్యా ప్రమాణాలను నియతకాలికముగా పునరీక్షించుట మరియు కొత్తగా వచ్చే సిబ్బంది అవసర అంశాలకు నిర్దేశించి కాలంచెల్లిన కోర్సులను తొలగించుట, కోర్సులను నవీకరించుట లేదా కొత్త కోర్సులను ప్రవేశపెట్టుట కొరకు సిఫారసులతో సహా తగిన అనుక్రమ చర్యలను తీసుకొనుట;

(టి) పారా వెటర్నరి మరియు అనుబంధ కోర్సులలో తగిన ప్రమాణాలను పాటించుటకు అవసరమని భావించునట్టి ప్రమాణాలు, సదుపాయములు, పాఠ్యాంశములు ప్రవేశ ప్రమాణాలు మొదలగు వాటిని విహితపరచుట;

(యు) రాష్ట్రములో పరీక్షా కేంద్రాలను నిర్ణయించుట;

(వి) పరీక్షల నిర్వహణకు సంబంధించి ప్రశ్నపత్రాలను వెల్లడిచేయుట, మార్కులను మార్పు చేయుట లేదా ఏదేని అట్టి ఇతర క్రమరాహిత్యముల వంటి అనుచిత చర్యలకు పాల్పడు కౌన్సిలు సిబ్బందిపై క్రమశిక్షణ చర్యను తీసుకొనుట;

(డబ్ల్యు) అంతర్గత మూల్యాంకన మార్కులు, హాజరులో క్రమరాహిత్యములు మొదలగు వాటితో సహా పరీక్షల ప్రక్రియకు నిర్దేశించి అనుచిత చర్యలకు సంస్థ పాల్పడినట్లుగా కనుగొనబడినచో సంస్థ గుర్తింపును రద్దు చేయుట;

(ఎక్స్) అధిసూచించబడునట్టి ఇతర చర్యలు మరియు విషయములను నెరవేర్చుట.

**18. ఉప-నిబంధనావళిని చేయుటకు అధికారము :-** (1) పరీక్షా విధానమునకు సంబంధించి కౌన్సిలు ఉద్దేశములు మరియు లక్ష్యములకు సంగతమైనట్టి ఉప-నిబంధనావళిని ఆయా సమయములలో చేయుటకు కౌన్సిలు సమర్థతను కలిగియుండవలెను.

(2) ఆ విధముగా చేయబడిన ఉప-నిబంధనావళి, పారా వెటర్నరి మరియు అనుబంధ పరీక్ష ఉత్తీర్ణుడై ఉండి కౌన్సిలు మంజూరు చేసిన ఒక ధ్రువపత్రమును కలిగివున్నట్టి ఎవరేని వ్యక్తికి భారత పశువైద్య కౌన్సిలు చట్టము, 1984లోని 30 (బి) పరిచ్ఛేదపు పరిధిలోపల ప్రభుత్వ మరియు ప్రైవేటు రంగములో ఉపాధికి అర్హులగుటకు వీలు కల్పించవలెను,- (1984లోని 52వ కేంద్ర చట్టము.)

(i) పారా వెటర్నరి మరియు అనుబంధ సంస్థలలోని సిబ్బందికి విద్యా ప్రమాణాలను నిర్ణయించుట, సాధన సామాగ్రి, వసతి, శిక్షణ మరియు ఇతర సదుపాయములను ఏర్పాటు చేయుట.

(ii) ఈ చట్టము క్రింద నిబంధించు లేదా నిబంధించబడునట్టి ఏదేని ఇతర విషయము మరియు ఈ చట్టము క్రింద నిబంధించబడని దానికి సంబంధించి మరియు ఎట్టి నియమములు చేయబడని వాటికి సంబంధించి ఏదేని ఇతర విషయము.

(3) పారా వెటర్నరి మరియు అనుబంధ సంస్థ సక్రమముగా పనిచేయుట లేదని మరియు పారా వెటర్నరి/అనుబంధ కోర్సులలో తగిన విద్యను గరపుటలో సదరు సంస్థ నిర్వహణ అనుచితమైనదిగా ఉన్నట్లుగాను విచారణలో కనుగొనబడినయెడల అట్టి సంస్థలకు ఇచ్చిన అనుమతి లేదా గుర్తింపును రద్దు చేయుటకు పారా వెటర్నరి మరియు అనుబంధ కౌన్సిలు సమర్థతను కలిగి ఉండవలెను. సంస్థ గుర్తింపు రద్దు ఉత్తరువులు అందిన తేదీ నుండి ముప్పది దినములలోగా ప్రభుత్వమునకు అపీలు చేసుకొనుటకై సదరు సంస్థకు హక్కు ఉన్నది మరియు దానిపై ప్రభుత్వ నిర్ణయము అంతిమమైనదై ఉండును.

**19. ప్రమాణము మొదలగు వాటిపై సాక్ష్యమును తీసుకొనుటకు అధికారము :-** ఈ చట్టము క్రింద అధికారములను వినియోగించు కౌన్సిలు లేదా కార్యదర్శి, అట్టి కార్యమును నిర్వర్తించు నిమిత్తము ఈ క్రింది విషయములకు సంబంధించి, సివిలు ప్రక్రియాస్మృతి, 1908 క్రింద ఒక దావాను విచారించునపుడు సివిలు న్యాయస్థానములో నిహితమైన అవే అధికారములను కలిగియుండవలెను, అవేవనగా,- (1908లోని 5వ కేంద్ర చట్టము.)

(ఎ) ఎవరేని వ్యక్తి తప్పనిసరిగా హాజరగునట్లు చేయుట మరియు అతనిని ప్రమాణముపై పరీక్షించుట;

(బి) దస్తావేజులను కనిపెట్టి మరియు దాఖలు చేయమని కోరుట;

(సి) అఫిడవిట్లపై సాక్ష్యమును స్వీకరించుట;

(డి) సాక్షులను పరీక్షించుటకు నోటీసులను జారీ చేయుట;

(ఇ) విహితపరచబడునట్టి ఇతర విషయములు.

## అధ్యాయము – V

## పారా వెటర్నరి మరియు అనుబంధ టెక్నీషియన్ రిజిస్ట్రేషను

**20. రిజిస్ట్రేషనుకు అర్హత :–** (1) ఈ చట్టము ప్రారంభపు తేదీనాటికి ప్రభుత్వము క్రింద నియామకమును కలిగియున్న ప్రతియొక డిప్లొమా హోల్డరు ఈ చట్టము క్రింద రిజిస్ట్రేషనుకు అర్హులై ఉండవలెను.

(2) గుర్తింపు పొందిన అర్హత కలిగివుండి ఈ చట్టము ప్రారంభపు తేదీ నుండి ఒక సంవత్సరము కాలావధిలోగా లేదా ప్రభుత్వముచే అధిసూచించబడునట్టి దీర్ఘ కాలావధిలోగా ఈ చట్టము అమలులోకి వచ్చిన తేదీకి ముందు రెండు సంవత్సరములకు తక్కువ కాని కాలావధి పాటు పారా వెటర్నరి టెక్నిషియన్‌గా నియతకాలిక ప్రాక్టీస్‌లో ఉండినట్లు మరియు కౌన్సిలుచే అట్టి ప్రయోజనము నిమిత్తము నిర్వహించబడిన పరీక్షలో ఉత్తీర్ణులైనట్లు నిరూపించు ప్రతియొక వ్యక్తి ఈ చట్టము క్రింద రిజిస్ట్రేషనుకు అర్హులై ఉండవలెను.

(3) ఎవరేని వ్యక్తి 5వ పరిచ్ఛేదము క్రింద అతను ఏవేని అనర్హతలకు గురైనయెడల ఉప–పరిచ్ఛేదము (1) లేదా ఉప–పరిచ్ఛేదము (2) క్రింద రిజిస్ట్రేషనుకు అర్హతను కలిగి యుండరు.

**21. రిజిస్ట్రేషను :–** (1) 20వ పరిచ్ఛేదములోని ఉప–పరిచ్ఛేదము (1) క్రింద రిజిస్ట్రేషనుకు అర్హత పొందిన ప్రతి వ్యక్తి సదరు ఉప–పరిచ్ఛేదము క్రింద వీలు కల్పించబడినట్లుగా రిజిస్ట్రేషనుకు అర్హులైన తేదీనుండి మూడు మాసములలోగా రిజిస్ట్రేషనుకు దరఖాస్తు చేసుకొనవలెను.

(2) 20వ పరిచ్ఛేదములోని ఉప–పరిచ్ఛేదము (2) క్రింద రిజిస్ట్రేషను కొరకు అర్హత కలిగినట్టి ప్రతి వ్యక్తి సదరు ఉప–పరిచ్ఛేదము క్రింద వీలుకల్పించబడినట్లుగా రిజిస్ట్రేషనుకు అర్హులైన తేదీనుండి మూడు మాసములలోగా రిజిస్ట్రేషనుకు దరఖాస్తు చేసుకొనవలెను.

(3) ఈ చట్టము క్రింద రిజిస్ట్రేషను కొరకు దరఖాస్తు విహితపరచబడునట్టి ప్రరూపంలో ఉండవలెను. మరియు విహితపరచబడునట్టి ఫీజును దానితోపాటు జతపరచబడవలెను.

(4) ఏదేని గుర్తింపు పొందిన అదనపు అర్హత విషయంలో రిజిస్ట్రేషను కొరకు కార్యదర్శికి దరఖాస్తు చేసుకునే ప్రతి ఒక పారా వెటర్నరి మరియు అనుబంధ టెక్నీషియను విహితపరచబడునట్టి ఫీజును చెల్లించవలెను.

(5) రిజిస్ట్రేషను కొరకు దరఖాస్తును కార్యదర్శికి పంపించవలెను మరియు దరఖాస్తుదారు అతని పేరు రిజిష్టరులో నమోదు చేయుటకు అర్హత కలిగిఉన్నట్లుగా కార్యదర్శి సంతృప్తిచెందిన యెడల అతను దరఖాస్తుదారు పేరును అందులో నమోదుచేసి విహితపరచబడునట్టి ప్రరూపంలో ఒక ధ్రువపత్రమును అతనికి జారీచేయవలెను.

(6) కార్యదర్శిచే రిజిస్ట్రేషను కొరకు చేసిన దరఖాస్తు తిరస్కరించబడిన ఎవరేని వ్యక్తి అట్టి తిరస్కరణ తేదీ నుండి మూడు మాసములలోగా కౌన్సిలుకి అపీలు చేసుకొనవచ్చును మరియు దానిపై కౌన్సిలు నిర్ణయం అంతిమమైనదిగా ఉండవలెను.

**22. రిజిస్ట్రేషను నవీకరణ :–** (1) 21వ పరిచ్ఛేదము క్రింద చేసిన ప్రతి రిజిస్ట్రేషను ఐదు సంవత్సరాలపాటు శాసనమాన్యతను కలిగివుండవలెను మరియు ఐదవ సంవత్సరము ముగియుటకు ముందుగా దానిని నవీకరించుకొనవలసి ఉంటుంది.

(2) గడువు తేదీకి ముందుగా నవీకరణ చేయబడిన సందర్భంలో కార్యదర్శి, రిజిష్టరు నుండి ఉపేక్షకుని పేరును తొలగించవలెను.

అయితే, ఆ విధంగా తొలగించిన పేరును, విహితపరచబడునట్టి జరిమానాతో కలిపి నవీకరణ ఫీజును చెల్లించిన మీదట రిజిష్టరులో మళ్ళీ చేర్చవచ్చును.

(3) నవీకరణ ఫీజు మరియు జరిమానా ఏదైనా ఉన్నట్లయితే, అట్టి వాటిని చెల్లించిన మీదట కార్యదర్శి విహితపరచబడునట్టి రీతిలో సంబంధిత వ్యక్తికి రిజిస్ట్రేషను ధ్రువపత్రాన్ని జారీ చేయవలెను మరియు రిజిష్టరు నుండి వ్యక్తి పేరును తొలగించిన చోట ఉప-పరిచ్ఛేదము (2) క్రింద తిరిగి అతని పేరును రిజిష్టరులో నమోదు చేయవలెను.

**23. రిజిష్టరు నుండి తొలగించుట :-** (1) ఈ పరిచ్ఛేదములోని నిబంధనలకు లోబడి, సబంధిత వ్యక్తి విన్నవించుకొనుటకు అతనికి తగిన అవకాశము ఇచ్చిన తరువాత మరియు చేయుటకు ఉచితమని భావించినట్టి తదుపరి విచారణ చేసిన తరువాత కౌన్సిలు సంతృప్తిచెందినపుడు అట్టి వ్యక్తి పేరును రిజిష్టరు నుండి ఈ క్రింది సందర్భములలో తొలగించవలసిందిగా అది ఉత్తరువు చేయవచ్చును,-

(ఎ) తప్పిదము వలన లేదా తప్పుడు సమాచారం కారణంగా లేదా ఏదేని ముఖ్యాంశాన్ని మరుగుపరచిన కారణంగా రిజిష్టరులో అతని పేరును నమోదు చేసినయెడల; లేదా

(బి) ఈ చట్టము క్రింద ఏదేని అపరాధమునకు అతను దోషస్థాపన చేయబడిన యెడల లేదా అతని వృత్తిలో అప్రతిష్టాకరమైన నడవడిక కారణంగా రిజిష్టరు జాబితాలో ఉందుటకు అతను అయోగ్యుడని కౌన్సిలు అభిప్రాయంలో దోషిగా ఉన్నయెడల; లేదా

(సి) అతను మోసపూరిత విధానం ద్వారా లేదా తప్పుడు ధ్రువపత్రం ద్వారా అట్టి ధ్రువపత్రం, డిప్లొమా పొందినట్లుగా నిరూపించబడినయెడల.

(2) రిజిష్టరు నుండి పేరు తొలగించవలసిందిగా ఉత్తరువు చేయబడిన ఎవరేని వ్యక్తి ఈ చట్టము క్రింద రిజిస్ట్రేషను కొరకు శాశ్వతముగా లేదా నిర్ధిష్టపరచబడునట్టి కాలావధికి అనర్హులుగా ఉప-పరిచ్ఛేదము (1) క్రింద ఉత్తరువు ద్వారా ఆదేశించవచ్చును.

(3) ఉప-పరిచ్ఛేదము (1) క్రింద ఉత్తరువు ద్వారా వ్యధితుడైన వ్యక్తి అట్టి ఉత్తరువు తేదీ నుండి ముప్పది దినములలోగా ప్రభుత్వమునకు అపీలు చేసుకొనవచ్చును మరియు ప్రభుత్వ నిర్ణయము అంతిమమైనదై ఉండవలెను.

(4) ఈ పరిచ్ఛేదము క్రింద రిజిస్టరు నుండి పేరు తొలగించబడిన వ్యక్తి వెంటనే తన రిజిస్ట్రేషను ధ్రువపత్రమును కార్యదర్శికి అప్పగించవలెను.

**24. రిజిస్టరులో తిరిగి నమోదు చేయుట :-** వ్రాతపూర్వకముగా రికార్డు చేయబడు కారణముల రీత్యా కౌన్సిలు ఏ సమయములోనైనా, 23వ పరిచ్ఛేదములోని ఉప-పరిచ్ఛేదము (1) క్రింద రిజిష్టరు నుండి తొలగించబడిన వ్యక్తి పేరును విహితపరచబడునట్టి ఫీజును చెల్లించిన మీదట తిరిగి నమోదు చేయవలెను.

## అధ్యాయము - VI

## పారా వెటర్నరి మరియు అనుబంధ విద్య మరియు శిక్షణ సంస్థల గుర్తింపు

**25. సంస్థల గుర్తింపు :-** (1) ఉప-పరిచ్ఛేదములు (2) నుండి (6) వరకు గల నిబంధనలకు లోబడి ఏవ్యక్తి, కౌన్సిలు ముందస్తు అనుమతి లేకుండా ఏదేని గుర్తించబడిన అర్హతను పొందడానికై విద్యార్ధులను తయారుచేయుటకుగాను ఒక పారా వెటర్నరి మరియు అనుబంధ సంస్థను స్థాపించరాదు లేదా ఏదేని పారా వెటర్నరి మరియు అనుబంధ కోర్సును నిర్వహించరాదు.

(2) పారా వెటర్నరి మరియు అనుబంధ సంస్థ గుర్తింపు కొరకు ఎవరేని వ్యక్తి విహితపరచబడునట్టి ప్రరూపములో కౌన్సిలు కార్యదర్శికి దరఖాస్తు చేసుకొనవచ్చును మరియు దానితోపాటు అట్టి ఫీజును చెల్లించవలెను.

(3) ఉప-పరిచ్ఛేదము (2) క్రింద చేసిన దరఖాస్తు అందిన మీదట కౌన్సిలు కార్యదర్శి విహితపరచబడునట్టి రీతిలో అట్టి విచారణను నిర్వహించవలెను మరియు విహితపరచబడునట్టి రీతిలో ఉత్తరువు ద్వారా గుర్తింపును మంజూరు చేయవచ్చును లేదా గుర్తింపు కొరకు చేసిన దరఖాస్తును తిరస్కరించవచ్చును.

(4) ఈ చట్టము క్రింద చేసిన వినియమముల ద్వారా కౌన్సిలుచే నిర్ణయించబడిన ప్రమాణములకు అనుగుణముగా ఉన్నట్టి విద్యా మరియు శిక్షణ సంస్థలకు మాత్రమే విహితపరచబడునట్టి రీతిలో గుర్తింపును ఒసగవలెను.

(5) ఉప-పరిచ్ఛేదము (1)లో ఏమి ఉన్నప్పటికీ, ఈ చట్టము ప్రారంభపు తేదీ నాటికి పారా వెటర్నరి మరియు అనుబంధ కోర్సులను నిర్వహిస్తున్నట్టి అన్ని సంస్థలు, ఈ చట్టము ప్రారంభపు తేదీ నుండి మూడు మాసములలోగా గుర్తింపు కొరకు కౌన్సిలుకి దరఖాస్తు చేసుకొనవలెను. గుర్తింపు కొరకు దరఖాస్తు చేసుకొనుచున్న సంస్థ, దీనికి సంబంధించి కౌన్సిలు నిర్ణయించిన ప్రమాణములకు అనుగుణముగా లేనిచో, తాత్కాలిక గుర్తింపు మంజూరు తేదీ నుండి ఒక సంవత్సర కాలావధిలోగా కౌన్సిలుచే నిర్ణయించబడిన ప్రమాణముల ననుసరించి అట్టి సదుపాయములను కల్పించవలెనన్న షరతుకు లోబడి తాత్కాలిక గుర్తింపును మంజూరు చేయవచ్చును.

(6) నిర్దిష్టపరచిన కాలావధిలోగా సంస్థ, కౌన్సిలు నిర్ణయించిన ప్రమాణములకు అనుగుణముగా సదుపాయములను ఏర్పాటు చేయనియెడల ఉప-పరిచ్ఛేదము (5) క్రింద మంజూరు చేసిన తాత్కాలిక గుర్తింపును వెంటనే ఉపసంహరించుకొనవలెను.

**26. గుర్తింపు ఉపసంహరణ :-** ఇందు గురించి కౌన్సిలుచే నియమించబడిన కమిటీ నివేదిక ఆధారముగా ఈ చట్టము క్రింద సంస్థ గుర్తింపు పొందినదని సంతృప్తి చెందడమైనది,-

(ఎ) గుర్తింపు షరతులను పాటించుటకు విఫలమైనదనీ; లేదా

(బి) గుర్తింపు కొరకు చేసిన దరఖాస్తు నిరాకరించబడుటకు యోగ్యతను ఆపాదించునట్టి కారణములు ఉన్నవనీ సంతృప్తి చెందినయెడల, కౌన్సిలు అట్టి గుర్తింపును ఉత్తరువు ద్వారా ఉపసంహరించుకొనవచ్చును. అయితే, అట్టి గుర్తింపు ఉపసంహరణకు ముందు కౌన్సిలు సదరు సంస్థను నిర్వహించుచున్న వ్యక్తి విన్నవించుకొనుటకు అతనికి ఒక అవకాశమును ఈయవలెను.

**27. అర్హత గుర్తింపు :-** (1) కౌన్సిలు నివేదనపై లేదా ఇతర విధముగా ఏదేని విశ్వవిద్యాలయము కౌన్సిలు లేక తత్సమయమున అమలులో ఉన్న ఏదేని శాసనము క్రింద స్థాపించబడిన సంస్థ ఇచ్చిన ఏదేని డిప్లొమా లేక ధ్రువపత్రమును ఈ చట్టపు ప్రయోజనముల నిమిత్తము గుర్తించబడిన అర్హతగా పరిగణించవచ్చును.

(2) ఉప–పరిచ్ఛేదము (1) క్రింద అర్హత గుర్తించబడినపుడు ప్రభుత్వము ఈ చట్టపు ప్రయోజనముల నిమిత్తము సమానమైన అర్హతగా అదే అర్హతను ఆంధ్రప్రదేశ్ గెజెటులో అధిసూచన ద్వారా ప్రఖ్యానించవలెను.

**28. సంస్థల తనిఖీ :–** (1) కౌన్సిలు, ఈ చట్టము క్రింద గుర్తింపును మంజూరుచేయు నిమిత్తము ఏదేని సంస్థను తనిఖీచేయుటకు అది అవసరమని భావించునట్టి సంఖ్యలో అధికారులను క్రమబద్ధ లేదా తాత్కాలిక ప్రాతిపదికపై నియమించవచ్చును.

(2) ఉప–పరిచ్ఛేదము (1)లో పేర్కొనబడిన అధికారులు, గుర్తింపుపొందిన సంస్థ అవసరమైన ప్రమాణములను పాటించునట్లుగా చూడడానికై వాటిని నియతకాలిక తనిఖీను చేయుటకు కూడా అధికారములను కలిగియుండవలెను.

(3) కౌన్సిలుచే అధికారమీయబడిన కార్యదర్శి లేదా ఎవరేని అధికారి, ఈ చట్టము లేదా దాని క్రింద చేయబడిన ఏదేని నియమము లేక వినియమము లేక ఉత్తరువులోని నిబంధనల ద్వారా అధికారమీయబడిన ఏదేని విచారణ లేదా తనిఖీ చేయుటకు ఏదేని గుర్తింపు పొందిన సంస్థల ప్రాంగణములలోనికి ప్రవేశించవచ్చును.

(4) గుర్తింపు పొందిన సంస్థ యొక్క నిర్వాహకుడు మరియు ఉద్యోగులు మరియు దాని ఉద్యోగులు ఈ పరిచ్ఛేదము క్రింద అధికారులు తమ కర్తవ్యములను నిర్వర్తించుటకు వీలు కల్పించుటకుగాను వారు అవసరమని భావించునట్టి అన్ని దస్తావేజులు మరియు సామాగ్రికి అట్టి సంస్థ ప్రాంగణములో తగిన అన్ని సమయములలో అట్టి ప్రవేశ సౌలభ్యాన్ని వారికి కల్పించుటకు బద్ధమై ఉండవలెను.

## అధ్యాయము – VII

## ఆర్థిక విషయములు

**29. కౌన్సిలు యొక్క నిధి :–** (1) స్వీకరించిన అన్ని ఫీజులు, అద్దె మరియు కౌన్సిలులో నిహితపరచబడిన ఆస్తులు మరియు నిధుల నుండి పొందిన లాభములు, ప్రభుత్వము నుండి స్వీకరించిన అన్ని గ్రాంట్లు మరియు రుణములు ఏవైనా ఉన్నట్లయితే అవి, ఏదేని వనరు అది ఏమైనప్పటికీ దాని నుండి స్వీకరించిన అన్ని ఎండోమెంట్లు మరియు దానములు, కౌన్సిలుకి చెందిన అన్ని ఇతర వివిధ రకములైన రాబడులు మరియు కౌన్సిలు వ్యవహారములకు సంబంధించి స్వీకరించిన అన్ని చెల్లింపులు వంటి అన్ని ఆదాయములు కౌన్సిలు నిధిగా ఏర్పాటు కావలెను. దానిని ఈ చట్టము మరియు దాని క్రింద చేయబడిన నియమములు, వినియమములు మరియు ఉత్తరువులలో విధించిన ప్రయోజనముల కొరకు వినియోగించవలెను.

(2) కౌన్సిలు నిధి, కౌన్సిలుచే నిర్ణయించబడునట్టి భారత రిజర్వు బ్యాంకు చట్టము, 1934లో నిర్వచించబడినట్లుగా ఒక షెడ్యూల్డు బ్యాంకులో లేదా ప్రభుత్వ ఖజానాలో డిపాజిట్ చేయబడవలెను. (1934లోని 2వ కేంద్ర చట్టము.)

(3) నిధి అభిరక్షణ, అందులో ద్రవ్యముల చెల్లింపు, అందులో నుండి ద్రవ్యముల ఉపసంహారణ మరియు అన్ని ఇతర అనుబంధ విషయములు ఇందుకోసం విహితపరచబడునట్టి నియమములచే క్రమబద్ధం చేయబడవలెను.

**30. వార్షిక లెక్కలు మరియు ఆడిట్లు :–** (1) కౌన్సిలు వార్షిక నివేదిక మరియు అకౌంట్లు దానిచే ఆమోదించబడవలెను మరియు తదుపరి సంవత్సరము సెప్టెంబరు మాసం ముగియుటకు ముందే ఆడిట్ చేయించవలెను:

అయితే, విధించిన మరియు వసూలు చేసిన ఫీజు రాబడులు మరియు ఖర్చులకు చెందిన లెక్కలు వార్షిక నివేదికలో కౌన్సిలుచే తగిన విధముగా ధ్రువీకరించబడవలెను.

(2) ప్రభుత్వముచే ఆమోదించబడిన ప్యానెలు నుండి కౌన్సిలుచే నియమించబడిన ఎవరేని ఛార్టర్డ్ ఆడిటరుచే ఆడిటు చేయించవచ్చును మరియు ఆడిటు ఖర్చును కౌన్సిలు భరించవలెను.

(3) ఆడిటు నివేదికతో కలిపి ఆడిటరుచే ధ్రువీకరించబడిన కౌన్సిలు లెక్కలను వార్షికముగా ప్రభుత్వమునకు పంపవలెను.

(4) ప్రభుత్వము, ఉప-పరిచ్ఛేదము (3) క్రింద తనకు పంపిన కౌన్సిలు లెక్కలను, ఆడిటు నివేదికతో కలిపి వార్షికముగా రాష్ట్ర శాసనమండలి సమక్షంలో ఉంచునట్లు చేయవలెను.

## అధ్యాయము - VIII

## అపరాధములు మరియు పెనాల్టీ

**31. ఈ చట్టము క్రింద రిజిష్టరు చేయబడని వ్యక్తులు ప్రాక్టీసు చేయకుండుట :-** (1) ఈ చట్టము క్రింద రిజిష్టరు చేయబడిన వ్యక్తి కాకుండా ఎవరేని ఇతర వ్యక్తి పారా వెటర్నరి మరియు అనుబంధ టెక్నీషియనుగా ప్రాక్టీసు చేయరాదు.

(2) ఈ పరిచ్ఛేదమునకు విరుద్ధముగా వ్యవహరించిన ఎవరేని వ్యక్తి దోషస్థాపన జరిగిన తరువాత ఈ క్రింది విధముగా శిక్షింపబడదగును.

(ఎ) మొదటి అపరాధము విషయములో ఆరు మాసముల కాలావధి దాకా పొడిగించదగు కారావాసముతోనూ లేదా ఒకవేయి రూపాయల వరకు ఉండగల జరిమానాతోనూ; మరియు

(బి) రెండవ లేదా దరిమిలా అపరాధము విషయములో ఒక సంవత్సరము దాకా పొడిగించదగు, ఐతే మూడు మాసములకు తక్కువ కాని కాలావధి పాటు కారావాసముతోనూ మరియు రెండువేల రూపాయలకు తక్కువ కాకుండా అయితే ఐదువేల రూపాయల వరకు విస్తరించగల జరిమానాతోనూ.

(3) పారా వెటర్నరి మరియు అనుబంధ టెక్నీషియను ఎవరుగాని భారత పశువైద్య కౌన్సిలు చట్టము, 1984లోని 30(బి) పరిచ్ఛేదము యొక్క నిబంధనలను ఉల్లంఘించరాదు. (1984లోని 52వ కేంద్ర చట్టము.)

**32. ఆసుపత్రులు, సంస్థల అపరాధములు :-** (1) ఔషధాలయము, ఆసుపత్రి, వైద్యశాల, ప్రసవశస్త్ర చికిత్స థియేటరు, ప్రయోగశాల లేదా ఇతర అదే విధమైన సంస్థలు మొదలైన వాటిచే ఈ చట్టము క్రింద రిజిష్టరు చేయబడిన పారా వెటర్నరి టెక్నిషియను అయినట్టి వ్యక్తిని తప్ప ఇతర ఎవరేని వ్యక్తిని పారా వెటర్నరి టెక్నీషియనుగా నియమించుకొనరాదు.

(2) ఉప-పరిచ్ఛేదము (1)లోని నిబంధనలను ఉల్లంఘించు వారెవరైననూ ఐదువేల రూపాయల వరకు ఉండగల జరిమానాతో శిక్షింపబడవలెను.

**33. అనధికారికముగా డిప్లొమా మొదలగు వాటిని ప్రదానము చేయుటపై నిషేధము :-** (1) ఈ చట్టము లేదా దాని క్రింద చేయబడిన నియమముల ద్వారా నిబంధించబడిననే తప్ప ఏవ్యక్తి అయినా, ఏదేని డిప్లొమా, ధ్రువపత్రము లేదా ఇతర దస్తావేజును కలిగియున్న వ్యక్తి, గ్రాంటు చేయబడిన వ్యక్తి లేదా వాటి స్వీకర్త పారా

వెటర్నరీ టెక్నీషియనుగా ప్రాక్టీసు చేయుటకు అర్హుడని తెలియజేస్తూ లేదా సూచిస్తూ అట్టి డిప్లొమా, ధ్రువపత్రము లేదా ఇతర దస్తావేజును ప్రదానము చేయరాదు, గ్రాంటు చేయరాదు లేదా జారీ చేయరాదు లేదా అట్లు చేయుటకు తనకు అర్హత ఉన్నదని తనకు తానుగా ప్రకటించుకొనరాదు.

(2) ఉప-పరిచ్ఛేదము (1)లోని నిబంధనలను ఉల్లంఘించు వారెవరైననూ దోషస్థాపన జరిగిన మీదట ఐదువేల రూపాయలదాక విస్తరించగల జరిమానాతో శిక్షింపబడవలెను మరియు ఒక అసోసియేషనులో ఆవిధముగా ఉల్లంఘించిన వ్యక్తి తెలిసియుండి లేదా ఉద్దేశపూర్వకముగా అట్టి ఉల్లంఘనకు అధికారమిచ్చినచో లేదా అనుమతినిచ్చినచో దోషస్థాపన జరిగిన మీదట ఒక వేయి రూపాయల దాకా పొడిగించదగు జరిమానాతో శిక్షింపబడవలెను.

**34. బిరుదులను అనధికారికముగా ఉపయోగించినందుకు పెనాల్టీ :-** (1) ఏవ్యక్తి ఒక పారా వెటర్నరి మరియు అనుబంధ టెక్నీషియనుగా ప్రాక్టీసు చేయుటకు అర్హతగా అతను డిప్లొమా, లైసెన్సు లేదా ధ్రువపత్రమును కలిగి ఉన్నట్లుగా సూచించే ఏదేని బిరుదు, అక్షరములు లేదా సంక్షిప్త పదములను క్రింది సందర్భములలో తప్ప అతని పేరుకు చేర్చుకొనరాదు.

(ఎ) అతను వాస్తవముగా అట్టి డిప్లొమా లేదా లైసెన్సు లేదా ధ్రువపత్రమును స్వీకరించిననూ; మరియు

(బి) అట్టి డిప్లొమా, లైసెన్సు లేదా ధ్రువపత్రము రాష్ట్రములో తత్సమయమమున అమలులో ఉన్న ఏదేని శాసనము ద్వారా గుర్తించబడిననూ లేదా ఈ చట్టము క్రింద నియమించబడిన ఒక ప్రాధికార సంస్థచే ప్రదానము చేయబడిననూ లేదా మంజూరు చేయబడిననూ లేదా జారీ చేయబడిననూ.

(2) ఉప-పరిచ్ఛేదము (1)లోని నిబంధనలను ఉల్లంఘించు వారెవరైననూ దోషస్థాపన జరిగిన మీదట మొదటి అపరాధమునకుగాను ఒక వేయి రూపాయల వరకు విస్తరించగల జరిమానాతోనూ మరియు రెండవ లేదా దరిమిలా అపరాధములకు రెండువేల రూపాయల వరకు పొడిగించదగు జరిమానాతోను శిక్షింపబడవలెను.

**35. అపరాధముల విచారణ :-** (1) ఈ చట్టము క్రింద అన్ని అపరాధములు, మొదటి తరగతి జుడిషియల్ మెజిస్ట్రేట్‌చే విచారణ చేయబడదగి ఉండును.

(2) ఉప-పరిచ్ఛేదము (1)లో ఏమి ఉన్నప్పటికీ, ఏ న్యాయస్థానము, కౌన్సిలు లేదా ఇందుకోసం కౌన్సిలుచే అధికారమీయబడిన ఒక అధికారి పూర్వానుమతితో తప్ప ఈ చట్టము క్రింద శిక్షింపదగు అపరాధమును విచారణకు స్వీకరించరాదు.

**36. సివిలు న్యాయస్థానముల అధికారితా పరిధికి అడ్డంకి :-** ఈ చట్టము ద్వారా లేదా ఈ చట్టము క్రింద ప్రదత్తము చేసిన ఏవేని అధికారములను వినియోగిస్తూ ప్రభుత్వము లేదా కౌన్సిలు లేదా కార్యనిర్వహణ కమిటీ లేదా కార్యదర్శిచే చేయబడిన ఏ కార్యము లేదా ఏ చర్య ఏదేని సివిలు న్యాయస్థానములో ప్రశ్నించబడరాదు.

**37. అపరాధముల రాజీ :-** కౌన్సిలు కార్యదర్శి ఈ చట్టము క్రింద శిక్షింపదగు ఏదేని అపరాధమును న్యాయస్థానము విచారణకు ముందుగా అట్టి అపరాధమునకు కనీస నిర్దిష్ట జరిమానాకు తక్కువ కానట్టి అయితే అట్టి అపరాధమునకు గరిష్ట నిర్దిష్ఠ జరిమానాకు పొడిగించదగునట్టి మొత్తమును చెల్లించిన మీదట అపరాధమును పరిష్కరించుట ద్వారా రాజీ చేయవచ్చును.

అయితే రెండవ లేదా దరిమిలా అపరాధము విషయములో అట్టి ఏ రాజీని అనుమతించరాదు.

## అధ్యాయము - IX
## వివిధ విషయములు

**38. కౌన్సిల్ సభ్యులు, అధికారులు మొదలైనవారు పబ్లిక్ సేవకులుగా ఉండుట :-** (1) ఈ చట్టము క్రింద నియమించబడిన కౌన్సిలు ప్రతియొక సభ్యుడు, కార్యదర్శి, అందరు అధికారులు మరియు ఉద్యోగులు భారత శిక్షాస్మృతి, 1860లోని 21వ పరిచ్ఛేదపు అర్థములోపల పబ్లిక్ సేవకులుగా భావించబడవలెను. (1860లోని 45వ కేంద్ర చట్టము.)

**39. సద్భావముతో తీసుకొనిన చర్యలకు రక్షణ :-** ఈ చట్టము లేదా దాని క్రింద జారీచేసిన నియమముల క్రింద సద్భావముతో చేసిన లేదా చేయుటకు ఉద్దేశించిన దేనికైనను సంబంధించి ప్రభుత్వము లేదా కౌన్సిలు లేదా దాని సభ్యుడు లేదా అధికారి లేదా ఇతర వ్యక్తిపై ఎట్టి దావా, అభియోగము లేదా ఇతర న్యాయ ప్రొసీడింగులను వేయరాదు.

**40. ప్రభుత్వముచే ఆదేశములు :-** (1) ప్రభుత్వము, సంప్రదించిన తరువాత కౌన్సిలు అనుసరించవలసిన సాధారణ ఆదేశములను కౌన్సిలుకి ఈయవచ్చును.

(2) ఈ చట్టము క్రింద తన అధికారములను వినియోగించుటలో మరియు కర్తవ్యములను నిర్వర్తించుటలో కౌన్సిలు, ప్రభుత్వ ముందస్తు అనుమతితో తప్ప ఉప-పరిచ్ఛేదము (1) క్రింద జారీచేసిన ఏవేని సాధారణ ఆదేశములను అతిక్రమించరాదు.

**41. చిక్కులను తొలగించుటకు అధికారము :-** (1) ఈ చట్టపు నిబంధనలను అమలుపరచుటలో ఏదేని చిక్కు ఏర్పడినచో ప్రభుత్వము అట్టి చిక్కును తొలగించుటకు అవసరమని లేక ఉపయుక్తమని తమకు తోచునట్టి నిబంధనలకు అసంగతముకాని దేనినైన ఉత్తరువు ద్వారా చేయవచ్చును.

(2) ఈ చట్టము ప్రారంభమైన తేదీ నుండి రెండు సంవత్సరముల కాలావధి గడచిన పిమ్మట ఉప-పరిచ్ఛేదము (1) క్రింద ఎట్టి ఉత్తరువు చేయబడరాదు.

**42. వినియమములను చేయుటకు అధికారము :-** (1) కౌన్సిలు, ప్రభుత్వ ముందస్తు ఆమోదముతో ఈ క్రింది అన్నీ లేక ఏవేని విషయముల కొరకు ఈ చట్టము లేదా దాని క్రింద చేయబడిన నియమములకు అసంగతముకాని వినియమములను చేయవచ్చును, అవేవనగా:-

(i) కార్యనిర్వహణ కమిటీ తన సమావేశమును నిర్వహించు సమయము మరియు ప్రదేశము మరియు అట్టి సమావేశమును సమావేశపరచు మరియు నిర్వహించు రీతి;

(ii) అధ్యయన కోర్సులు మరియు కాలావధి మరియు నిర్వహించు ఆచరణ పూర్వక శిక్షణ, పరీక్ష సబ్జెక్టులు మరియు గుర్తింపు పొందిన అర్హతా ప్రమాణములు;

(iii) పరీక్షలలో ఉత్తీర్ణులగు అభ్యర్థులకు అట్టి శిక్షణ మరియు డిప్లొమాలను గ్రాంటు చేయు నిమిత్తము ఏదేని సంస్థను గుర్తించుట;

(iv) ఈ కోర్సులలోనికి ప్రవేశము కొరకు నెరవేర్చవలసిన కనీస నిర్ణయ ప్రమాణాలు మరియు అభ్యర్థుల ఎంపికలో అనుసరించవలసిన కార్యవిధానము;

(v) సంస్థలో సిబ్బంది ప్రమాణములు, పరికరాలు, వసతి, శిక్షణ మరియు విద్య కొరకు ఇతర సదుపాయములు;

(vi) వృత్తిపర పరీక్షల నిర్వహణ, పరీక్షకుల అర్హత మరియు అట్టి పరీక్షకు ప్రవేశ షరతులు;

(vii) పారా వెటర్నరి మరియు అనుబంధ టెక్నీషియను పాటించవలసిన వృత్తిపర నడవడి మరియు మర్యాద ప్రమాణములు మరియు నైతిక విలువల స్మృతి;

(viii) అర్హతల గుర్తింపు కొరకు కార్యవిధానము మరియు షరతులు.

(2) ఈ పరిచ్ఛేదము క్రింద చేయబడిన అన్ని వినియమములు ఆంధ్రప్రదేశ్ గెజెటులో ప్రచురించబడవలెను.

(3) కౌన్సిలు, ప్రభుత్వ ముందస్తు ఆమోదముతో ఏవేని అట్టి వినియమములను గెజెటులో అధిసూచన ద్వారా ఎప్పుడైనా మార్పు చేయవచ్చును, సవరించవచ్చును లేదా రద్దుచేయవచ్చును.

**43. నియమములు చేయుటకు అధికారము :-** (1) ప్రభుత్వము ఆంధ్రప్రదేశ్ గెజెటులో అధిసూచన ద్వారా ఈ చట్టములోని అన్ని లేదా ఏవేని ప్రయోజనములను అమలుజరుపుటకు అందులో ఉన్న ఏవేని నిబంధనలకు అసంగతముకాని నియమములను చేయవచ్చును.

(2) ప్రత్యేకముగా మరియు పైన పేర్కొనిన సాధారణ అధికార వ్యాపకతకు భంగము కలుగకుండా ఈ క్రింది వాటిని నిబంధిస్తూ ప్రభుత్వము నియమములను చేయవచ్చును.

(ఎ) 13వ పరిచ్ఛేదము క్రింద కౌన్సిలు అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు మరియు ఇతర సభ్యులకు చెల్లించవలసిన ఫీజులు మరియు ఇతర భత్యములు;

(బి) కార్యదర్శి నియామకపు విధానము, అర్హతలు, జీతభత్యములు మరియు ఇతర సర్వీసుల షరతులు;

(సి) 21వ పరిచ్ఛేదము క్రింద రిజిస్టర్ల ప్రరూపము మరియు వాటిలో నమోదు చేయబడు వివరములు;

(డి) 21వ పరిచ్ఛేదము క్రింద దరఖాస్తుల ప్రరూపములు మరియు చెల్లించదగు ఫీజులు;

(ఇ) 21వ పరిచ్ఛేదములోని ఉప-పరిచ్ఛేదము (5) క్రింద జారీచేయబడు ధ్రువపత్ర ప్రరూపము మరియు అందులో ఉండవలసిన వివరములు;

(ఎఫ్) 22వ పరిచ్ఛేదము క్రింద నవీకరణ ఫీజు మరియు జరిమానా చెల్లింపు;

(జి) 24వ పరిచ్ఛేదము క్రింద విధించదగు ఫీజు;

(హెచ్) 29వ పరిచ్ఛేదము క్రింద కౌన్సిలు నిధి అభిరక్షణ మరియు ఆనుషంగిక విషయములు;

(ఐ) ఈ చట్టము క్రింద చేయబడిన నియమముల ద్వారా విహితపరచు లేదా విహితపరచబడునట్టి ఏదేని ఇతర విషయము.

(3) ఈ చట్టము క్రింద చేసిన ప్రతి నియమము దానిని చేసిన వెంటనే అపుడు రాష్ట్ర శాసనమండలి సమావేశమునందున్నచో ఆ సమావేశములో, అది సమావేశములో లేనిచో వెనువెంటనే వచ్చు సమావేశములోను దాని సమక్షమున మొత్తము పదునాలుగు దినముల కాలావధిపాటు ఉంచవలెను. అట్టి కాలావధి ఒకే సమావేశములో గాని రెండు అనుక్రమ సమావేశములలో గాని చేరి ఉండవచ్చును మరియు అట్లు దానిని ఉంచిన సమావేశము లేదా దాని తరువాత సమావేశము ముగియులోపల రాష్ట్ర శాసనమండలి ఆ నియమములో లేదా ఆ నియమము రద్దులో ఏదేని మార్పు చేయుటకు అంగీకరించినచో ఆ మార్పు లేదా రద్దు ఆంధ్రప్రదేశ్ గెజెటులో అధిసూచించబడిన తేదీ నుండి ఆ నియమము అట్లు మార్పు చేయబడిన రూపములో మాత్రమే అమలు కలిగివుండును లేదా సందర్భానుసారముగా రద్దగును. అయినప్పటికీ ఏదేని అట్టి మార్పు లేదా రద్దు ఆ నియమము క్రింద అంతకు పూర్వం చేయబడిన దేని శాసనమాన్యతకైననూ భంగము కలిగించదు.